# ఫైనాన్స్ భూతం

పాలకడలిపై... కర్లాన్‌పరుపులా తేలుతున్న పదితలల నాగేంద్రుడి మీద ఎప్పటిలాగే స్టైల్ ఇచ్చి పడుకున్నాడు శ్రీమహావిష్ణువు. ఏనాడూ నడవని పాదాల్ని ఒత్తుతూ కూచుంది మహాసాధ్వి.

ఉత్తుంగ తరంగాలై లేచిపడే క్షీర(పాల) సముద్రం నిశ్చలంగా వుండిపోవటంతో అనుమానంవేసిన మహావిష్ణువు "దేవీ... క్షీర సముద్రం కెరటాలతో పొంగు లెత్తటం లేదేమిటి?" అనడిగాడు దర్పంగా.

దేవి మూతి మూడు వంకర్లు తిప్పి... వెనకటి సిన్మాల్లో కన్నాంబ లెవల్లో గుర్రుగా చూసింది. పెళ్లాలకు కోపమొస్తే మగాళ్ల పరేషానేందో... మహావిష్ణువుకి దశావతారాల్లో వేలసార్లు గుణపాఠమే కాబట్టి... తత్తరపాటుని కప్పిపుచ్చుకుంటూ కూల్‌గా అడిగాడు. "అదేమిటి దేవీ! పాలసముద్రంపై నీకేమైనా కోపమొచ్చిందా?" అని.

దానికి దేవి సూర్యకాంతం లెవల్లో గయ్‌న లేచి "కోపం రాదామరి? చిరంజీవి అన్నయ్య చీరెలని ఆంధ్రాలో ఈ మధ్యే ఈ చీరెలొచ్చాయి. మురిపెంగా కట్టుకుంటె మీక్షీర సముద్రం కెరటం వచ్చి తడిపేసింది. కోపమొచ్చి పాల సముద్రంలో కాస్తంత తోడు (పెరుగు) వేసాను. దాంతో మీ క్షీర సముద్రం గడ్డకట్టుకుపోయింది" అంది రోషంగా.

"హతోస్మి" అనుకున్నాడు విష్ణువు పెరుగు సముద్రం పులిస్తే కంపువాసన కొడ్తుంది అన్న భయంతో ఇంకా విష్ణులోకానికి కేబుల్ కనెక్షన్ అందలేదు కాబట్టి... ఖాళీగా కూచొని భారీగా ఆలోచించటం దేవతలకి అలవాటే కాబట్టి...

"స్వామి. కాకుల్ని కొట్టి గద్దలకు వేయటమంటే ఏంటో చూపించరూ" అంది డౌటుగా సినిమా చూపించండి అన్నంత తేలిగ్గా.

కాళ్లు పిసుకుతూ డౌట్లు అడగటం తప్ప ఆమెకు మరేంపనిలేదని మనసులో అనుకున్న విష్ణువు. మళ్లీ ఏ నరులకు మూఢిందో... పాపం" అనుకుంటూనే 'ఇదిగోదేవీ... చూపిస్తాను' అన్నాడు. రిమోట్ తన చేతిలోనే కదానన్న ధీమాతో.

అప్పుడే నారదమహర్షి గిటార్ మీటుతూ వచ్చాడు.

జి.ఆర్.వో (గాడ్ రిలేషన్ ఆఫీసర్) గా నారదుడు తెగ బిజీగా వుంటున్నాడీ మధ్య. రాగానే రాగం ఆపేసి "ప్రభూ... పాయింట్ కొస్తాను. ఆమధ్య మద్యనిషేధం వల్ల మధ్యతరగతి కొంపల్లో కొంత ధనం పేరుపోయింది. దాంతో వాళ్లకి అహం పెరిగింది. ఓ... కలర్ టీవీలు, స్కూటర్లు, ఫ్రిజ్‌లు... ఆగట్లేదు ప్రభూ... అహం పెరిగి మనకి భక్తితో కొబ్బరికాయ కొట్టేవాళ్లే కరువవుతున్నారు. చచ్చీచెడీ... ఎవడన్నా టెంకాయ కొడితే కొత్త స్కూటర్ ముందో, కలర్ టీవీ ఆన్‌చేసేముందో, కంప్యూటర్ మానిటర్ ముందో కొడుతున్నారు కాని... భక్తితో మనకి మాత్రం కొట్టట్లేదు. భూలోకంలో నెల్రోజులు మైక్రోలెవల్ సర్వే చేసి ఇది కనిపెట్టా... దీనికంతటికీ మధ్యతరగతి వాడికి పెరుగుతున్న డబ్బు ప్రభూ... డబ్బు" అని హింటిచ్చాడు.

విష్ణువు చిద్విలాసంగా నవ్వాడు.

"పిచ్చి నారదా... మధ్య తరగతివాడు ఎదిగితే మనకి పూజలు కరువవుతాయి. దానికో పరిష్కారం కనిపెట్టాను. అందుకే ఈ బుడ్డీని తీసికెళ్లి ముందు ఆంధ్రాలో విడిచిపెట్టు" అన్నాడు ఓ బుడ్డీని అందిస్తూ...

"ఇందులో ఏముంది ప్రభూ..." క్వొశ్చెన్ మార్కు ఫేసుతో అడిగాడు నారదుడు.

"అందులో ఫైనాన్స్ భూతం వుంది నారదా" చిన్నగా నవ్వుతూ అన్నాడు విష్ణువు.

ఓ ఫైన్ మార్నింగ్ నారదుడు దుర్ముహూర్తం చూసుకొని బుడ్డీని పదిలంగా తెచ్చి హైదరాబాద్ నగరంలో భూతాన్ని విడిచిపెట్టాడు. అక్కన్నించి జగిత్యాల వెళ్లమన్నాడు. పని పూర్తయ్యాక వరంగల్, నిజామాబాద్, ఆంధ్రా, రాయలసీమ ఆర్టీసీవాళ్ల సీజన్ టికెట్ తీస్కొని విచ్చలవిడిగా తిరిగిరమ్మన్నాడు. అలా ఆదేశాలు జారీ చేసి

గిటార్ మీటుకుంటూ కుచ్‌కుచ్‌హోతాహై అని కూనిరాగం తీసుకుంటూ వెళ్లిపోయాడు.

ముందు ఫైనాన్స్ భూతం రూపాయిబిళ్లల ఘల్లుఘల్లుమని శబ్దంతో డాన్స్ చేసింది. తర్వాత ఏం చేయాలో తెలీక దిక్కులు చూస్తుండిపోయింది.

పనీపాటాలేని కొందరు కనపడగానే... వాళ్ల జులాయ్ బాడీల్లోకి దూరబడింది.

క్షణాల్లో... వాళ్ల మెదళ్లు బెలూన్లలా ఉబ్బిపోయాయి.

సెంటు వాసన్లా... వాళ్ల శరీరాల్లోంచి రూపాయినోట్ల వాసన అదరగొట్టింది. చిత్ర విచిత్రమన ఆలోచనలు పుట్టుకొచ్చాయి.

డబ్బు సంపాదించే సులువైన మార్గం స్కోప్‌లో కనపడింది.

అంతే! లక్ష్మీదేవి, సాయిబాబా, మణికంఠుడు, సూర్యచంద్రుల పేర్లమీద ఫైనాన్స్ భోర్డులు వెలిసాయి.

అందమైన బ్రోచర్లు... ఇంటింటికీ తరలివెళ్లాయి.

వాటిమీద లక్షలనగదు, లక్ష్మీబొమ్మలు, అందమైన మారుతీ కార్ల బొమ్మలు, నెక్లెస్‌లు, అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్స్... ఒక్కటేమిటీ మధ్యతరగతి బుర్రని తొలిచే పురుగులన్నీ మారువేషాల్లో బ్రోచర్లపై సాక్షత్కరించాయి. క్రమంగా ఫైనాన్స్ భూతం కొత్తవందనోటులా కరకరలాడుతూ ఒళ్లు విరుచుకొని... విజృంభించింది. దాంతో మధ్యతరగతి వాళ్ల పోపుల డబ్బాల్లోంచి, నెలజీతాల్లోంచి, పాసుబుక్కుల్లోంచి, అరువుల్లోంచి, ఆత్యాశల్లోంచి... పచ్చనోట్లు కప్పపిల్లల్లా ఎగిరెగిరి పడుతూ... ఫైనాన్స్‌ల్లోకి ఏకధాటిగా వచ్చిపడ్డాయి.

ఫలితంగా... రిజర్వ్‌బ్యాంక్ పేరు తెలినోడు సైతం... షట్టర్లు తెరిచాడు.

ఏ డిగ్రీలేని వాళ్లు... చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లయ్యారు.

సైకిల్‌లేనివాడికి... మారుతీకార్లొచ్చాయి. అద్దాల అరలు మెత్తటికార్పెట్లు... రయ్‌రయ్‌మంటూ కార్లల్లో షికార్లు. హీరోయిన్‌ని చూసి తరిస్తూ ఆ మైకంలో సినిమాలకి పెట్టుబడులు.

లక్షలకు లక్షలకు వచ్చిపడుతున్న డబ్బుతో ఏం చేయాలో తెలీక... బొంబాయి, హైదరాబాద్, బెంగుళూరులలో షేర్లు... ఇండస్ట్రీలకు అధిక వడ్డీలకు అప్పులు సినిమా రంగానికి ఫైనాన్స్‌లు... మంది డబ్బుతో ఎంత జల్సా చేయొచ్చో చూసి ఫైనాన్స్ భూతానికి కూడా మూర్ఛవచ్చింది.

పచ్చి బటానీలు అమ్ముకోవడానిక్కూడా పనికిరాని వాడు ఫైనాన్స్ చైర్మెన్ అయి సెంట్రల్ మినిష్టర్ లెవల్లో తిరుగుతుంటే.... ఉద్యోగుస్తులక్కూడా ఊసురుమంది. చేట్లో బీడీలు చుడుతూ... బ్లాక్ అండ్ వైట్ టీవీని బంగారంలా చూసే వాళ్ల మిస్సెస్సులు అపర లక్ష్మీదైవీలా అవతారమెత్తేసరికి... ఆడాళ్ల గుండెలు బడబాగ్నులైపోయాయి.

'మళ్లీ తిరిగిచ్చే నాటికి చూద్దాంలే...' అన్న లెవల్లో పేట్రేగిపోతున్న ఫైనాన్స్‌ల వ్యక్తుల్ని చూసి భూతానికి సిగ్గనిపించి... మహావిష్ణువు దగ్గరికి మళ్లీ పరిగెత్తుకొచ్చింది. అప్పటికీ అక్కడ సాయిబాబా, అయ్యప్పస్వామి, సూర్యచంద్రులు ఇంకొందరు కోపంగా వున్నారు. "మా షేర్లుపెట్టుకొని... మధ్య తరగతి వాళ్లని దోచుకోవటం భావ్యంకాదు. ఆ ఫైనాన్స్‌ల్ని కూలదోల్చండి" అంటూ మొరపెట్టుకున్నారు.

ఫైనాన్స్ భూతం "ప్రభూ... కొద్దిరోజులైతే ఇక్కడకూడా బ్రాంచీలు ఒపెన్ చేస్తారు. సాక్షాత్తు లక్ష్మీదేవితోనే డిపాజిట్లు చేయించినా ఆశ్చర్యపోకండి. వాళ్ల బుర్రలు బొర్రా గుహలంత పెద్దవి ప్రభూ... హమ్మమ్మ... పరాయి సొమ్ముతో వాళ్ల జల్సాలు చూసి నాకే దిమ్మతిరిగిపోయింది." అంది.

అంతా విని నర్మగర్భంగా నవ్వాడా విష్ణువు. సరే అని మిగతావాళ్లకి హామీ ఇచ్చి ఫైనాన్స్ భూతాన్ని మళ్లీ పొమ్మన్నాడు.

"మహాప్రభూ... నేను వెళ్లలేను. ఆపని ఇక దేవతలు, దెయ్యాలతో అయ్యేదికాదు. ముళ్లని ముళ్లతేనే తీయటం తమరికి ట్రెయినింగే కదా... మీరే థింక్ చేయండి" అంది.

విష్ణువు అయిదు నిమిషాలు ఆలోచించాడు.

ఓ పోలీసాధికారి తక్షణమే మనసులో మెదిలాడు. అతడు వస్తూ వస్తూనే ఫైనాన్స్‌ల మీదనే పడ్డాడు. కొందరి పటాటోపం చూసి ఆశ్చర్యపోయాడు. ఫలితంగా... డ్రాలు బందయ్యాయి.

మారుతీ కార్లు మాయమయ్యాయి.

షట్టర్లు మూతబడ్డాయి.

బోర్డులు తిరగబడ్డాయి.

కార్పెట్లు, కుషన్ ఛైర్లు కనుమరగయ్యాయి.

ఇంట్లో ఆడాళ్లముందు... మళ్లీ బీడీల చేటలు ప్రత్యక్షమయ్యాయి. చాలామంది రోడ్డున పడ్డారు. డిపాజిటర్ల బాధలు పడలేక హైదరాబద్, బొబాయిలు తిరుగుతున్నారు.

వాళ్ల అవస్థల్ని పైనించి చూసిన విష్ణుభార్య "ప్రభూ... ఫైనాన్స్ భూతాన్ని పంపి మధ్య తరగతి గల్లాడబ్బాల్ని కొల్లగొట్టారు. సరేకాని... ఫైనాన్స్ పెట్టిన వాళ్లకి ఏం ఒరిగింది? ఆ డబ్బంతా షేర్లకు, ఇండస్ట్రీయలిస్టుల చేతుల్లో చేరింది కదా"

"పిచ్చిదానా... కాకుల్ని కొట్టి గద్దలకు పెట్టడమంటే ఏంటని డౌట్ అడిగాడు కదా... ఇదేనన్నమాట" అని చెప్పి ఘంటసాల గొంతుతో నీతి వాక్యం రీసౌండ్‌లో చెప్పాడు.

"కాని కష్టం చేయకుండానే ఎదిగి పావాలకునే మనుషులు అథపాతాళానికి పోతారు. శ్రమ జీవులకి మాత్రమే శాశ్వత సుఖం లబిస్తుంది. అలా కానివారికి అండర్‌గ్రౌండే

జీవితమవుతుంది.

దేవతలు విష్ణువుపై పూలవర్షం కురిపించారు.

అంతా అయ్యాక ఫైనాన్స్‌భూతం "ప్రభూ నా తక్షణ కర్తవ్యంబేమి?" అనడిగింది. నీ అవసరం ఏ రాష్ట్రంలోనైనా రావచ్చు. అంతవరకూ ఈ బుడ్డీలో దూరు" అని ఆజ్ఞాపించాడు శ్రీ మహావిష్ణువు.

సరిగ్గా... ఆ సమయానికే విచ్చేసిన నారదుడు "ధన్యోస్మి ప్రభూ... మధ్యతరగతి వాళ్లని సరే... ఉన్నవాడి డబ్బుని సైతం కొల్లగొట్టి భూతాన్నేదైనా సృష్టించపోతున్నారా?" అనడిగాడు.

"పూర్‌నారదా... అదెప్పుడో సృష్టించాను. దాన్ని 'సైబర్ భూతం' అంటారు" అని చెప్పాడు.

"మరి దాని కేరాఫ్ అడ్రసెక్కడ స్వామీ?"

"అది ప్రస్తుతం కోలావెంకటకృష్ణమోహన్ అనే వాడి కంప్యూటర్‌లో నిద్రపోతోంది నారదా!" చిరుదరహాసంతో చెప్పాడు మహావిష్ణువు. (కథ కేవలం కల్పితం... ఎవర్నీ ఉద్దేశించి రాసింది కాదు... రచయిత)